సాక్షి ప్రకాశం

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



అర్ధరాత్రి ఆర్తనాదాలు

ఎదురెదురుగా టిప్పర్, మినీ ట్రక్ ఢీకొని ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పొదిలి మండలం అగ్రహారం వద్ద జరిగింది. - 8లో..



దివ్యాంగులకు సమాన అవకాశాలతో అభివృద్ధి

సుగమ్య భారత్ యాత్రను కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34/22

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగ్గురు ఎస్సైల బదిలీ

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ముగ్గురు ఎస్సైలను తాత్కాలికంగా బదిలీ చేస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు వన్‌టౌన్‌లో పనిచేస్తున్న టీ.త్యాగరాజును దొనకొండకు, ఒంగోలు వీఆర్‌లో ఉన్న ఎస్‌వీ రమణను ఒంగోలు టూటౌన్‌కు, కొమరోలులో పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర నాయక్‌ను ఒంగోలు వన్‌టౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సంబంధిత డీఎస్పీలు ఆయా ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: వీధి కుక్కల సంతతిని నియంత్రించేందుకు కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా సొసైటీ ఫర్ క్రూయెల్టీ టు యానిమల్స్ (ఎస్‌పీసీఏ) సమావేశం నిర్వహించారు. దీనిలో జంతు సంక్షేమానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు. వీధి కుక్కల నియంత్రణతోపాటు జంతు బలి, జంతువుల అక్రమ రవాణాను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అటువంటి వాటికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంతు సంక్షేమ చట్టాలకు అనుగుణంగా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. జంతువుల రవాణా చేసే సమయంలో తీసుకోవాల్సిన సంరక్షణ భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అక్రమ రవాణాలో స్వాధీనం చేసుకున్న పశువులను ఆలయ గోశాలల్లో ఉంచి సంరక్షించాలన్నారు. సమావేశంలో డీపీఓ వెంకటనాయుడు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఈఓ కిరణ్ కుమార్, పశు సంవర్ధక శాఖ, ఫారెస్ట్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదల గూడుపై కాలసర్పం



మార్కాపురం ఇడుపూరు లేఅవుట్‌లో బేస్‌మెంట్ లెవెల్లో ఆగిన నిర్మాణాలు

ప్రజాసంక్షేమానికి తూట్లు పొడుస్తూ సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం పాడిన కూటమి పాలకులు పేదల ఇళ్లనూ వదలడం లేదు. గత ప్రభుత్వంలో మంజూరైన పేదల ఇళ్లు ఏకారణం చేతనైనా నిర్మించుకోలేకపోతే వాటిని రద్దు చేసేందుకు గడువు పెట్టింది. మంజూరైన ఇళ్లతో పాటు, ఇళ్ల పట్టాలనూ రద్దు చేస్తామని గృహ నిర్మాణశాఖ అధికారుల ద్వారా ఒత్తిడి చేస్తోంది. దీంతో రోజుగడవటమే కష్టంగా ఉన్న పేదలు దిక్కుతోచని స్థితిలో ఇదెక్కడి దిక్కుమాలిన ప్రభుత్వమని దుమ్మెత్తి పోస్తున్నారు.

జిల్లాలో మంజూరైన గృహాలు మొత్తం	63,279
పూర్తయిన గృహాలు:	22,256
నిర్మాణంలో ఉన్నవి:	22,961
ప్రారంభం కానివి:	18,062

- నిర్మాణం ప్రారంభించని పేదల గృహాలు రద్దు చేస్తామన్న కూటమి ప్రభుత్వం
- మార్చి 31 వరకు గడువు
- ఒక్క కొత్త ఇల్లూ ఇవ్వకపోగా.. మంజూరైన ఇళ్లు, ఇళ్ల పట్టాల రద్దుకు కుట్ర
- ఇప్పటికే సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం
- చేతిలో డబ్బులేక పేదల వెతలు

మార్కాపురం: కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లపై కక్ష కట్టింది. పేదల సొంతింటి కలను దూరం చేస్తోంది. ఇప్పటికే ఇళ్లు మంజూరైన వారు వచ్చే నెల 31లోపు నిర్మించుకోకపోతే వారి గృహాలు, పట్టాలను రద్దుచేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేదల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద మొత్తం జిల్లాలో మొత్తం 63,279 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 22,256 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 22,961 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకూ 18,062 గృహాలు ప్రారంభం కాలేదు.

కూటమి ప్రభుత్వంలో పేదల మెడపై కత్తి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని పీఎంఏవై, ఎన్టీఆర్ నగర్ స్కీముగా పేరు మార్చింది. అయితే పేదల గృహాలపై పడగ విప్పింది. ఇప్పటికిప్పుడు కట్టుకుంటావా.. లేదా.. అంటూ గృహ నిర్మాణ శాఖ అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తోంది.



ఇళ్లు ప్రారంభం కాక పిచ్చిచెట్లు మొలిచిన దృశ్యం

వివిధ కారణాలతో పలువురు పేదలు గృహాలను ఇంకా ప్రారంభించలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని కూటమి ప్రభుత్వం మార్చి 31లోపు గృహాలు కట్టనివారి పట్టాలను, ఇళ్లను రద్దుచేయాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా 18,062 గృహాల నిర్మాణం రద్దుకానుంది. పశ్చిమ ప్రకాశంలో సుమారు 3,910 మంది పేదలకు మంజూరైన గృహాలు రద్దుకానున్నాయి. వైఎస్సార్ జగనన్న కాలనీలను కూడా రద్దుచేసే కుట్రకు ప్రభుత్వం తెరలేపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో ఇచ్చిన అన్ని రకాల సంక్షేమ పథకాలను నిలిపేసింది. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేక పేదలు రోజుగడవటమే కష్టంగా బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించడం తలకు మించిన భారమవుతోంది. కాస్తంత డబ్బు సమకూర్చుకుని చిన్న గూడుకట్టుకుందామనుకున్న పేదల మెడపై కత్తి పెట్టినట్టు ప్రభుత్వ నిర్ణయం ఉందని ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

ఒక్క ఇల్లూ మంజూరు చేయని కూటమి ప్రభుత్వం:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలైనా అర్హులైన పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకపోగా ఉన్నవాటినీ రద్దు చేస్తున్నారు. దీంతో అర్హులైన పేదలు, కొత్తగా పెళ్లైనవారు పక్కా గృహాల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు కొత్త ఇళ్లు మంజూరవుతాయో కూడా తెలీదు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణంలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విషయమై మార్కాపురం గృహనిర్మాణ శాఖ అధికారిని వివరణ కోరగా మార్చి 31లోపు గృహాలు కట్టుకోకుంటే రద్దుచేస్తామని, ఈలోపు ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్న వారికి బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



మార్చి 31లోపు గృహాలను కట్టుకోని లబ్ధిదారుల పట్టాలను ప్రభుత్వం రద్దుచేస్తానని చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి పేదలకు మేలు జరిగేలా వారికి ఆర్థిక సాయం అందిస్తూ ప్రోత్సహించాలి. ఇలా రద్దుచేస్తూ తీసుకున్న నిర్ణయం పేదల సొంతింటి కలను దూరం చేయడమే.

– రఫీ, సీపీఎం మార్కాపురం పట్టణ కార్యదర్శి

గత ప్రభుత్వంలో పేదల గూటికి భరోసా..

గత ప్రభుత్వం అర్హులైన అందరికీ ఇంటిపట్టాలతోపాటు గృహాలు కేటాయించింది. అర్హులైన పేదలు సొంతిల్లు కావాలంటే ఎప్పుడైనా ఇంటికి దగ్గరలో ఉన్న సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సచివాలయ సిబ్బంది పరిశీలించి వెంటనే మంజూరు చేసేవారు. ఇంటి నిర్మాణానికి సుమారు రూ.1.80 లక్షల నగదుతోపాటు ఇంటి యజమానురాలు పొదుపు గ్రూపులో ఉంటే బ్యాంకు లింకేజీ రుణాన్ని కూడా ఇప్పించారు. దీంతో త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తికావడంతో పలువురు గృహ ప్రవేశాలు చేసి నివాసముంటున్నారు. దీంతో రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో కొత్తగా జగనన్న కాలనీలు, వైఎస్సార్ నగర్‌లు ఏర్పడ్డాయి.

రిజిస్ట్రేషన్‌కు సంకటం

- కొత్త నిబంధనలతో స్టాంప్ వెండర్లకు తిప్పలు
- ఆధార్ నంబర్ ఇచ్చి, ఓటీపీ చెబితేనే స్టాంప్‌లు లభ్యం
- కంప్యూటర్, ప్రింటర్ సామగ్రి తప్పనిసరి



నూతనంగా ఇచ్చే స్టాంప్ పేపర్



పాత స్టాంప్ పేపర్

బేస్తవారిపేట: ప్రభుత్వం పెట్టిన అడ్డగోలు నిబంధనలతో స్టాంప్ వెండర్లు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన విధానం వెండర్లతోపాటు ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తోంది. గతంలో స్టాంప్ పేపర్ కావాలంటే నేరుగా వెండర్ వద్దకు వెళ్లిగాని, ఎవరినైనా పంపించిగానీ కొనుగోలు చేసుకోవచ్చు. ఇప్పుడు స్టాంప్ కావాల్సిన వారే వెళ్లాలి. ఆధార్‌కార్డు నంబర్ ఇచ్చి వారి ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలి. అప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేసి స్టాంపు ప్రింట్ తీసి ఇస్తారు. స్టాంపు కోసం కనీసం 10–15 నిమిషాలకుపైనే పడుతోంది. ఆన్‌లైన్‌లో ఆధార్ ఓపెన్ కాకపోతే స్టాంపు లభించదు.

పరికరాలతో అదనపు భారం...

జిల్లాలోని స్టాంపు వెండర్‌లు కంప్యూటర్, ప్రింటర్ సమకూర్చుకోవాలి. వీటన్నింటినీ పెట్టుకోవడానికి ఒక షాపు ఏర్పాటు చేసుకోవాలి. ఈ వృత్తిలో ఎన్నో ఏళ్లుగా అరకొర ఆదాయంతో పనిచేస్తున్న పెద్దవారు ఉన్నారు. చాలామందికి కంప్యూటర్ నైపుణ్యం లేదు. వచ్చే కొద్దిపాటి కమీషన్‌తోనే జీవిస్తున్నారు. వీరు వేలకు వేలు ఖర్చుపెట్టి పరికరాలు కొనుగోలు చేయాలి. జిల్లాలోని యర్రగొండపాలెం, సంతనూతలపాడు, పొదిలి, ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, దర్శి, కంభం, చీమకుర్తి, అమ్మనబ్రోలు, కనిగిరి, సింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో దాదాపు 150 మంది స్టాంపు వెండర్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలతో ఈ వృత్తికి కొందరు ఇప్పటికే దూరం అయ్యారు. మరికొందరు తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

కొనుగోలుదారులకూ తిప్పలు..

పాత తేదీలతో స్టాంపులు విక్రయించడం, అవినీతి లేకుండా ఈ విధానం తెచ్చామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కొత్త విధానం అమలు చేసేటప్పుడు జిల్లా రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు, స్టాంపు వెండర్లకు సమాచారం ఇవ్వకుండానే అమల్లోకి తెచ్చారు. ఆస్తి అమ్మకాలు, కొనుగోలు చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన వృద్ధులకు చుక్కలు కనపడుతున్నాయి. వయస్సు మళ్లిన వాళ్ల ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్టాంపు పేపర్ కావాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ఆధార్ నెంబర్ నమోదు చేసినప్పుడు వచ్చిన ఓటీపీ చెబితేనే స్టాంపు పేపర్ వచ్చే పరిస్థితి ఉంది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు..

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచింది. దీంతో భూముల కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్ల సంఖ్య పడిపోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయింది. జనవరి ఒకటో తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. ప్రారంభంలో తీవ్ర వ్యతిరేకత రావడంతో పేరు, అడ్రస్ నమోదు చేసుకుని స్టాంపులు ఇచ్చేలా వెసులుబాటు కల్పించారు. మళ్లీ పది రోజుల నుంచి ఆధార్ ఓటీపీ విధానం పెట్టారు. జనవరి నెల నుంచి కొందరికి ఆధార్‌కు సెల్‌ఫోన్ నంబర్ లింక్ కాకపోవడంతో స్టాంప్ పేపర్లు వచ్చే పరిస్థితి లేక రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోయారు. ఆధార్ నమోదు కేంద్రాల చుట్టూ తిరిగి సెల్ నంబర్ లింకు చేయించుకునే సమయానికి ఈనెల ఒకటో తేదీ నుంచి భూములు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చార్జీలు అమాంతం పెంచారు. దీంతో ప్రభుత్వ అడ్డగోలు నిబంధనలతో నష్టపోవాల్సి వచ్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టాంపుల విక్రయం అరకొరగానే ఉంటోంది. వెండార్లకు కొద్దిపాటి వచ్చే ఆదాయంలో కోతపడింది.

రాష్ట్ర స్థాయి పోటీలు అభినందనీయం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జడ్జి కే భరత్ చంద్ర, డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

- జూనియర్ సివిల్ జడ్జి కే భరత్ చంద్ర

కనిగిరిరూరల్: రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లను కనిగిరిలో నిర్వహించడం అభినందనీయమని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కే భరత్ చంద్ర అన్నారు. జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు, కాస్మోపాలిటన్ క్లబ్ మాజీ అధ్యక్షుడు దివంగత పులి వెంకట రమణారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో శుక్రవారం జడ్జి కే భరత్ చంద్ర, డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, క్లబ్ అధ్యక్షుడు ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ మాట్లాడుతూ క్రీడలతో మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ తుమ్మా ఉమా మహేశ్వరరెడ్డి, కమిషనర్ డానియల్ జోసఫ్, వైస్ పులి శాంతి, పులి లక్ష్మీ, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, లాన్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి, సీహెచ్ ప్రకాశ్ రావు, కే మనోహర్‌రెడ్డి, జీఏ సత్యన్నారాయణ, అద్దంకి రంగబాబు, వెలుగూరి చంద్రశేఖర్, నిర్వాహక కమిటీ నాయకులు పాల్గొన్నారు. తొలిరోజు క్రీడా పోటీలను అధికారులు ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 70 టీంలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకూడదు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: వేసవికాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకూడదని, అందుకు ముందస్తుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నీటి వనరులు, అవసరాలను బట్టి అదనంగా సమకూర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సత్వరమే వాటర్ ఆడిట్ నిర్వహించాలన్నారు. గ్రామాలు, వార్డుల వారీగా అందుబాటులో ఉన్న నీటి వనరులను గుర్తించడంతోపాటు ఏప్రిల్ నెల వరకు ఎంత మేరకు నీరు అవసరం అవుతుందో ఆడిట్ నిర్వహించాలని సూచించారు. వచ్చే సోమ, మంగళవారాల్లో సచివాలయ స్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఈ పని పూర్తి చేసేలా చూడాలన్నారు. బుధ, గురువారాల్లో మండల స్థాయిలో పరిశీలన చేసి శుక్రవారం నాటికి నివేదిక అందజేయాలన్నారు. చేతి పంపుల మరమ్మతులు చేయాలన్నారు. అందుకు అవసరమైన విడిభాగాలను సమకూర్చుకునేందుకు టెండర్లు నిర్వహించాలన్నారు. తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రకాశం భవనంలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. కాల్ సెంటర్ కోసం 9100121605 నంబర్‌ను కేటాయించినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. దీనిలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్డీఓ వెంకట శివరామరెడ్డి, డీపీఓ వెంకట నాయుడు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లేబర్ సెస్ విధిగా వసూలు చేయాలి:

నిర్మాణ రంగానికి సంబంధించి ఒక శాతం లేబర్ సెస్‌ను విధిగా వసూలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సెస్‌పై లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రతి నెలా 5వ తేదీలోపు సెస్ వసూలు వివరాలను కార్మిక శాఖకు అందజేయాలన్నారు. దీనిలో సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాస్‌కుమార్, సహాయక కార్మిక కమిషనర్‌లు భవాని, అనిత్వాని, పవన్‌కుమార్, కోటేశ్వరరావు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

9న క్యాన్సర్, డ్రగ్స్ నియంత్రణపై 5కె మారథాన్



సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు

ఒంగోలు సిటీ: క్యాన్సర్, డ్రగ్స్ నియంత్రణ పై యువతకు అవగాహన కల్పించేందుకు రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, టెక్‌బుల్స్ వారి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల 5కే మారథాన్ రన్ నిర్వహిస్తున్నట్లు రైజ్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, నిర్వాహకులు భరత్, ప్రవళిక, టెక్‌బుల్ సీఈఓ భాస్కర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ర్యాలీతో పాటు 2 వేల మంది యువతతో నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీని ఎస్పీ దామోదర్ ప్రారంభిస్తారన్నారు. మినీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రతి వంద మందిలో ముగ్గురు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నట్లు సర్వే ద్వారా తెలుస్తోందని, అలానే యువత డ్రగ్స్‌కు బానిసలై వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. వీటిపై అవగాహన కల్పించి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా 5కె మారథాన్ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెక్ బుల్ సీఈవో భాస్కర్ మాట్లాడుతూ మారథాన్ నిర్వహించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించామని, రెండు వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అందరికీ పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. రైజ్ ట్రెజరర్ శిద్దా భరత్ మాట్లాడుతూ 6 గంటలకే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న యువకులు మినీస్టేడియం వద్దకు చేరుకుని అక్కడ నుంచి బయలు దేరి మిరియాల పాలెం సెంటర్ వద్ద యూటర్న్ తీసుకుని మళ్లీ మినీస్టేడియం వరకు రావాల్సి ఉంటుందన్నారు.

రైల్వే ఉద్యోగిపై హత్యాయత్నం

- నాలుగు నెలల బిల్లులపై ఒకేసారి సంతకాలు చేయాలని టీడీపీ కాంట్రాక్టరు సోదరుని ఒత్తిడి
- కుదరదని చెప్పిన హెల్త్ ఇన్‌స్పెక్టర్‌ను చంపుతానంటూ దాడి
- తన వెనక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారంటూ బెదిరింపులు
- ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిడితో జీఆర్పీ పోలీసులు నామమాత్రపు కేసు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందకిశోర్ యాదవ్

ఒంగోలు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా సంతకాలు చేయడానికి నిరాకరించిన రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై అధికార టీడీపీకి చెందిన రైల్వే పారిశుధ్య కాంట్రాక్టరు సోదరుడు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుని కథనం మేరకు.. విజయవాడకు చెందిన టీడీపీ నేత తానికొండ రాధాకృష్ణ ఎస్వీఆర్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో వివిధ రైల్వేస్టేషన్లలో క్లీనింగ్ పనులను కాంట్రాక్టు తీసుకుని చేయిస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రతీనెలా రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌కు బిల్లులు పెట్టుకోవాల్సి ఉంటుంది. అయితే, గత ఏడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరుతో పాటు ఈ ఏడాది జనవరికి సంబంధించి మొత్తం నాలుగు నెలల బిల్లులను కాంట్రాక్టరు సోదరుడు గిరిధర్ ఈనెల 5న తీసుకొచ్చారు. ఈ బిల్లులపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారు. ఇందుకు ఒంగోలు రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎస్. నందకిశోర్ యాదవ్ అంగీకరించలేదు. బిల్లులను పరిశీలించిన తర్వాతే సంతకాలు చేస్తానని, దానికి సమయం పడుతుందని తేల్చిచెప్పారు. దీంతో.. గిరిధర్ కోపంతో ఊగిపోతూ నందకిషోర్ చొక్కా పట్టుకుని దాడికి ప్రయత్నించాడు. ''నా వెనక అధికార పార్టీ ఉంది, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారు.. నా సంగతి నీకు తెలీదు నా కొ..''.. అంటూ పచ్చిబూతులతో విరుచుకుపడ్డారు. దీంతో నందకిషోర్ దగ్గరలోని జీఆర్పీ పోలీసుస్టేషన్‌కు పరుగు పరుగున వెళ్లి జరిగిన సంగతి చెప్పారు. తనకు ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించమని కోరారు. కానీ, బీరువా తాళాలు మరిచిపోవడంతో తిరిగి ఆయన ఆఫీసులోని తన గదికి వెళ్లగా గిరిధర్ మళ్లీ వచ్చి తన మీదే పోలీసు కేసు పెడతావా అంటూ రెచ్చిపోయాడు. నిన్ను చంపుతానంటూ నందకిశోర్‌ను విచక్షణారహితంగా కొట్టడంతో ఆయన చేయి విరిగింది. శుక్రవారం శస్త్ర చికిత్స నిర్వహించారు.

రైల్వే పోలీసులకు ఎమ్మెల్యే దామచర్ల ఫోన్..

ఇదిలా ఉంటే.. కాంట్రాక్టరు రాధాకృష్ణకు మద్దతుగా ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జీఆర్పీ పోలీసులకు ఫోన్‌చేసి కేసుకు నీరుగార్చేందుకు ప్రయత్నించినట్లు రైల్వే ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. గిరిధర్ మీద నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రాధాకృష్ణ కాంట్రాక్టును రద్దుచేయాలని, గిరిధర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని రైల్వే సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

పేగు బంధం మమకారం చూపలేదని..

- ఆత్మహత్యకు యత్నించిన తండ్రి మృతి
- గత బుధవారం తల్లి మృతి


వెంకటేశ్వరరెడ్డి

దర్శి: కొడుకు చూడటం లేదని యాతం వెంకటేశ్వరరెడ్డి, నారాయణమ్మ అనే వృద్ధ దంపతులు గత సోమవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. వారిని ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ గత బుధవారం నారాయణమ్మ (60) మృతిచెందింది. శుక్రవారం వెంకటేశ్వరరెడ్డి (70) కూడా పరిస్థితి విషమించి మృతి చెందాడు. నారాయణమ్మ కొంత కాలంగా కాన్సర్‌తో బాధపడుతుండగా, వెంకటేశ్వరరెడ్డి నడుం నొప్పితో బాధపడుతున్నారు. వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న తమను కుమారుడు పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో వారు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

పసరు మందు వికటించి యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కంభం: పసరు మందు వికటించి యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కంభంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు వివరాలు.. రాచర్ల మండలం అనంపల్లి గ్రామానికి చెందిన బొట్టే సునీల్(27) గత నాలుగు నెలల నుంచి కంభం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. అతనికి మద్యం అలవాటు ఉంది. మద్యం తాగడం మానుకోవాలని భావించి కంభం పట్టణంలోని ఓ నాటు వైద్యుడి వద్ద పసరు మందు తీసుకుంటున్నాడు. పసరు మందు తీసుకున్న ఆ యువకుడు.. వెంటనే మద్యం తాగడంతో అది వికటించి మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. యువకుడి మృతదేహాన్ని కంభం ఎస్సై నరసింహారావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు. మృతుడికి తల్లి దండ్రులు, ఒక సోదరుడు ఉన్నారు.

- అంతా జనార్దన మాయ!

ఆన్‌లైన్‌లో హాజరు.. క్షేత్ర స్థాయిలో లేరు!

- సచివాలయ విధులకు డుమ్మా కొడుతున్న కొందరు సిబ్బంది
- బయోమెట్రిక్‌లో హాజరు వేసుకుని రిజిస్టర్‌లో సంతకాలు చేయని వైనం
- కొందరు రబ్బర్ థంబ్ వినియోగిస్తున్నట్లు ఆరోపణలు
- అనుకూలంగా ఉంటే పనిచేయకపోయినా పర్వాలేదన్నట్టుగా ఎంపీడీఓ తీరు

ముండ్లమూరు(దర్శి):

ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాల్సిన గ్రామ సచివాలయాల ఉద్యోగుల్లో కొందరు.. ఉన్నతాధికారుల సేవలో తరిస్తున్నారు. మండల స్థాయి అధికారి మౌఖికంగా చెబుతున్న పనులు చేస్తూ విధులకు డుమ్మా కొడుతున్నారు. అయితే తనకు అనుకూలంగా ఉంటున్నారన్న కారణంతో ఆ ఉద్యోగులు ఏం చేసినా సదరు అధికారి మిన్నకుండిపోతుండటం విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. ముండ్లమూరు మండలంలోని పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం, పులిపాడు, ఉల్లగల్లు సచివాలయాల ఉద్యోగుల్లో ఒకరిద్దరు మాత్రమే శుక్రవారం హాజరు పట్టికలో సంతకాలు చేశారు. కానీ అందరూ బయోమెట్రిక్‌లో హాజరు వేశారు. సచివాలయంలో ఉద్యోగులు లేకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పనుల కోసం వచ్చిన వారు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

పూరిమెట్ల కార్యదర్శి రెండు నెలలుగా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. ఉమామహేశ్వర పురం కార్యదర్శి మరో రెండు సచివాలయాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫోన్ చేస్తే మరో సచివాలయంలో ఉన్నానని సమాధానం చెబుతున్నారు. ఉమామహేశ్వర పురం సచివాలయంలో నలుగురి విధులు ఒక ఉద్యోగే చేయడం గమనార్హం. మిగితా నలుగురు కూటమి


పూరిమెట్ల సచివాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు


పూరిమెట్ల సచివాలయ రిజిస్టర్‌లో ముగ్గురి సంతకాలు

నాయకుల అండదండలతో విధులకు డుమ్మా కొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూరిమెట్ల సచివాలయంలో ఒక ఉద్యోగి మాత్రమే కనిపించారు. మిగిలిన వారు థంబ్‌లు వేశారు కానీ గ్రామంలో లేరు. పులిపాడు, ఉల్లగల్లు సచివాలయాల్లో కూడా ఇదే పరిస్థితి. గత ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించిన సచివాలయ ఉద్యోగులు.. ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి ఇదే తంతు కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి.

పట్టించుకోని ఎంపీడీఓ

సచివాలయాల్లో కొందరు ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంపై ఎంపీడీఓ జనార్దన్‌కు ఫిర్యాదులందినా పెద్దగా పట్టించుకోలేదు. తనకు అనుకూలంగా నడుచుకుంటున్న ఉద్యోగులు బయోమెట్రిక్ థంబ్ వేసి వ్యక్తిగత పనులు చూసుకుంటున్నా ఆయన స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం ముండ్లమూరు మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడం ప్రజల ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. ఇదిలా ఉండగా కొందరు సెక్రటరీలు సచివాలయాలకు రాకుండా తమ నివాసాల వద్ద పనులు చక్కబెడుతుండటం ప్రభుత్వ పాలనా తీరును స్పష్టం చేస్తోంది.

రబ్బర్ థంబ్‌పై గుసగుసలు

ముండ్లమూరు మండలంలోని సచివాలయాల్లో కొందరు సిబ్బంది రబ్బర్ థంబులను వినియోగించి ఇతరులతో బయోమెట్రిక్ హాజరు వేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపీడీఓతో కుమ్మక్కైన కొందరు ఉద్యోగులు ఆయన అండదండలతో రిజిస్టర్ సంతకాలు కూడా చేయకుండా రోజూ విధులకు డుమ్మా కొడుతున్నారని సచివాలయ ఉద్యోగ వర్గాలే ఆరోపిస్తున్నాయి. రబ్బరు వేలిముద్రలను తూర్పు గంగవరంలో తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కొందరు సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా కొడుతుండటంపై ఎంపీడీఓ జనార్ధన్‌ను వివరణ కోరగా.. 'రబ్బరు థంబ్‌ల విషయం నా దృష్టికి రాలేదు. అలా చేస్తే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటాం. ఉద్యోగులు విధులకు హాజరు కాని పక్షంలో చర్యలు తీవ్రంగా ఉంటాయ'ని చెప్పారు.


ఉమామహేశ్వరపురంలో..


ఉల్లగల్లు సచివాలయంలో..


పులిపాడు సచివాలయంలో..

అర్ధరాత్రి ఆర్తనాదాలు

- పొదిలి మండలం అగ్రహారం వద్ద రోడ్డు ప్రమాదం
- ఎదురెదురుగా ఢీకొన్న టిప్పర్, మినీ ట్రక్
- ట్రక్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్, మరో ఇద్దరు ప్రయాణికులు
- ఒకరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

పొదిలి రూరల్: మితిమీరిన వేగం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. అర్ధరాత్రి వేళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారు రక్తమోడుతున్న దేహాలతో చేసిన ఆర్తనాదాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. ఎదురెదురుగా వేగంగా ప్రయాణిస్తున్న రెండు వాహనాలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఒంగోలు–కర్నూలు రహదారిపై పొదిలి మండలంలోని అగ్రహారం సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన పోలినేని మాల్యాద్రి గిద్దలూరు నుంచి టమోటాలు తీసుకొచ్చేందుకు మినీ ట్రక్‌తో వెళ్తున్నాడు. పొదిలి మండలం కాటూరివారిపాలేనికి చెందిన గంధం ప్రసాద్(36), కంచర్ల సత్య చీమకుర్తిలోని ఓ గ్రానైట్ కంపెనీలో విధులు ముగించుకుని రోడ్డుపై వేచి ఉన్నారు. అదే సమయంలో గిద్దలూరు వైపు వెళ్తున్న మినీ ట్రక్‌ను ఆపి క్యాబిన్‌లో కూర్చున్నారు. పొదిలి నుంచి చీమకుర్తి వైపు వెళ్తున్న టిప్పర్, గిద్దలూరు వైపు వెళ్తున్న మినీ ట్రక్ అగ్రహారం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం ధాటికి మినీ ట్రక్ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ మాల్యాద్రితోపాటు ప్రసాద్, సత్య తీవ్రగాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రక్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన వారికి అతి కష్టమ్మీద బయటకు తీశారు. ప్రసాద్‌కు కాలు విరగడంతోపాటు శరీరానికి బలమైన గాయాయ్యాయి. మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గంధం ప్రసాద్ పరిస్థితి విషమించడంతో గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు ప్రసాద్‌కు భార్యతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.


అగ్రహారం సమీపంలో ఢీకొన్న వాహనాలు


మృతి చెందిన గంధం ప్రసాద్


ప్రసాద్(ఫైల్)

సమాన అవకాశాలతోనే దివ్యాంగుల అభ్యున్నతి

- సుగమ్య భారత్ యాత్రను ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా


సుగమ్య భారత్ యాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగులకు సమాన అవకాశాలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. విభిన్న ప్రతిభావంతులశాఖ ఆధ్వర్యంలో సుగమ్య భారత్ యాత్రను శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్–2 యాప్ రూపొందించిందన్నారు. పని ప్రదేశాలు, ఇతర ప్రాంతాలలో దివ్యాంగులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించేందుకు ఈ యాప్ ద్వారా వీలవుతుందన్నారు. దివ్యాంగులు తమ సమస్యలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా అధికారులు తక్షణమే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులశాఖ రాష్ట్ర డైరెక్టర్ రవిప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో ఎదురవుతున్న అవరోధాలను తొలగించడం, అన్ని విషయాలలో సమాన అవకాశాలు కల్పించడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ర్యాలీలో విభిన్న ప్రతిభావంతులశాఖ జిల్లా సహాయ సంచాలకులు గురజాల అర్చన, జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానంద్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.రవికుమార్, డీఎస్ఏఓ పద్మశ్రీ, డీసీహెచ్ఎస్ సూరిబాబు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్ర, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం అన్నం పెట్టడం లేదు సార్

- విభిన్న ప్రతిభావంతుల శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు దివ్యాంగ చిన్నారుల ఫిర్యాదు
- ఒంగోలులో వసతి గృహాన్ని పరిశీలించిన డైరెక్టర్


వసతి గృహంలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న డైరెక్టర్

ఒంగోలు వన్‌టౌన్: మెనూ ప్రకారం తమకు భోజనం పెట్టడం లేదని విభిన్న ప్రతిభావంతులు ఆ శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఒంగోలు పర్యటనకు వచ్చిన విభిన్న ప్రతిభావంతుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి రాత్రి వేళ దివ్యాంగుల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వసతి గృహ పరిసరాలను తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులు తమ సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన మెనూ పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జి.అర్చన, విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు సులోచనా రాణి, పసుమర్తి రాజేష్, అమీర్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పుట్టుకతో వచ్చే వ్యాధులను నివారించాలి

- జిల్లా సీనియర్ న్యాయాధికారి హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి హేమలత

ఒంగోలు అర్బన్: పుట్టుకతో వచ్చే వ్యాధుల నివారణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని జిల్లా సీనియర్ న్యాయాధికారి హేమలత సూచించారు. శుక్రవారం జిల్లా బాల భవిత కేంద్రంలో కాన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ పుట్టుకతో పిల్లల్లో వచ్చే వ్యాధుల పట్ల అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ప్యానల్ న్యాయవాదులు అవగాహన కలిగి ఉండి వాటి నివారణకు కృషి చేయాలన్నారు. అటువంటి లక్షణాలున్న వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక దశలోనే ఆ వ్యాధుల నుంచి పిల్లలను రక్షించాలన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలను నివారించేందుకు కృషి చేయాలన్నారు. బడి ఈడు పిల్లలను బడికి పంపాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ హేమసుజన, శిశు సంక్షేమ అధికారి దినేష్‌కుమార్, భగీరథి, ప్రీతం, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

తలనీలాల వేలం రూ.2.30 కోట్లు

వలేటివారిపాలెం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి తలనీలాల వేలం రూ.2.30 కోట్ల ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం దేవస్థానంలో 11 అంశాలకు సంబంధించిన వాటికి వేలం నిర్వహించామని చెప్పారు. ముందుగా తలనీలాలు వేలం పాట నిర్వహించగా ఏలూరుకు చెందిన సూర్యోదయ ఎంటర్ ప్రైజర్స్ రూ.1.82 కోట్లకు వేలం పాడగా, సీల్డ్ టెండర్ ద్వారా గుంటూరుకు చెందిన గౌతమ్ బుద్ధా ప్రాజెక్ట్ సంస్థ రూ.2,30 కోట్లకు హెచ్చు పాట వేసి దక్కించుకున్నారు. గతేడాది కంటే తలనీలాలు వేలం ద్వారా రూ.80 లక్షలు అదనంగా వచ్చినట్లు ఈవో తెలిపారు. అనంతరం కొబ్బరి చిప్పలు, కొబ్బరి కాయలు అమ్ముకొనుటకు వేలం నిర్వహించగా పాటదారులు వేలానికి రాకపోవడంతో వాయిదా వేశారు. అనంతరం పూజ సామగ్రి వేలం మొదలు పెట్టగా గతేడాదికి రూ.35 లక్షలు ఉండగా, ఈ ఏడాది వేలం నిర్వహణలో పాటదారులు రూ.33.60 లక్షలకు పాడగా పర్యవేక్షణ అధికారి కలుగజేసుకొని గతం కన్నా తక్కువగా ఉండటం వలన వాయిదా వేస్తామని ప్రకటించారు. దీంతో పాటదారులకు పర్యవేక్షణ అధికారి మధ్య వాదోపవాదాలు జరగడంతో ఆలయ అధికారి అన్ని వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆయన ప్రకటించారు. తదుపరి వేలం నిర్వహించే తేదిని త్వరలో ప్రకటిస్తామని ఆయన చెప్పకొచ్చారు. ఈకార్యక్రమం పర్యవేక్షణ అధికారి కందుకూరు శివాలయ ఈఓ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో జరిగింది. ఆలయ సిబ్బంది వెంకటేశ్వరరావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

పరిశ్రమల కోసం భూముల పరిశీలన

ఉలవపాడు: రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర వాణిజ్య శాఖ కార్యదర్శి ఎస్ యువరాజ్, కలెక్టర్ ఓ. ఆనంద్‌లు శుక్రవారం పరిశీలించారు. ఉలవపాడు ఉత్తర బైపాస్‌లో పెట్రోల్ బంక్ సమీపంలో భూములు, అలగాయపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ భూములను వారు పరిశీలించారు. అనంతరం కరేడు చెరువును పరిశీలించారు. చెరువు నిండా నీరు ఉండడంతో వర్షాధారమా లేదా ప్రాజెక్టు ద్వారా నీటిని నింపారా అని అడిగి తెలుసుకున్నారు. చెరువు ఆయకట్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెంకాయచెట్లపాలెంలోని భూములను పరిశీలించారు. మ్యాపుల సహాయంతో ప్రభుత్వ, పట్టా భూములకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, తహసీల్దార్ లావణ్య ఉన్నారు.


మ్యాపులను పరిశీలిస్తున్న వాణిజ్యశాఖ కార్యదర్శి, కలెక్టర్

అక్రమాలపై విచారించిన స్పెషల్ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ కలెక్టర్ జాన్సన్

యర్రగొండపాలెం: ఎటువంటి పత్రాలు లేకుండా ఇతరుల పేరుతో అక్రమంగా భూమిని ఆన్‌లైన్ చేసిన విషయంపై స్పెషల్ కలెక్టర్ ఎస్.జాన్సన్ శుక్రవారం విచారణ చేపట్టారు. యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్లపల్లె గ్రామానికి చెందిన కేశనపల్లి వీరయ్య మిల్లంపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 416/2లో 5 ఎకరాల భూమిని దాదాపు 40 సంవత్సరాల నుంచి సాగుచేసుకుంటున్నాడు. ఈ భూమి హక్కుదారుగా 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం అతనికి పట్టా ఇచ్చింది. ఆ తర్వాత ఆన్‌లైన్ కూడా చేశారు. 2025 జనవరి 17వ తేదీ వరకు ఆ భూమి వీరయ్య పేరుతోనే ఆన్‌లైన్‌లో ఉంది. ఆ తర్వాత ఆ సర్వే నంబరులో ఉన్న భూమిని విడదీసి రెండున్నర ఎకరాలను ఆ గ్రామానికి చెందిన కేశనపల్లి పాలంకయ్య పేరుతో ఆన్‌లైన్ చేశారు. దీనిపై కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వీరయ్య ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్.. ఈ వివాదంపై దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని స్పెషల్ కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ మేరకు విచారించిన స్పెషల్ కలెక్టర్.. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. అక్రమంగా ఆన్‌లైన్ చేయడం వెనుక మండలంలో పెత్తనం చలాయిస్తున్న ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి హస్తం ఉందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్లు అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

బేస్తవారిపేట: మహిళ మెడలోని బంగారు ఆభరణాలు దోచుకున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. శుక్రవారం బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. మార్కాపురానికి చెందిన షేక్ అబ్దుల్ రవూఫ్ యర్రగొండపాలెం పశువైద్యశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను 2024 అక్టోబర్ ఒకటో తేదీన పెద్దారవీడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవరాజు గట్టు దగ్గర 30 గ్రాముల బంగారు సరుడును ఓ మహిళ మెడలో నుంచి లాక్కెళ్లాడు. అబ్దుల్ రవూఫ్ నర్సింగ్ ఫైనలియర్ చదువుతున్న మార్కాపురానికి చెందిన దార్ల జోసఫ్ అంబేడ్కర్‌తో కలిసి మరో నేరానికి పాల్పడ్డాడు. జనవరి 29వ తేదీన బేస్తవారిపేట మండలంలోని చిన్న ఓబినేనిపల్లె బస్టాండ్ సమీపంలో మోడి రాజమ్మ మెడలోని 25 గ్రాముల బంగారు సరుడు లాక్కెల్లారు. ఇద్దరు నిందితులు మార్కాపురం కమలా జూనియర్ కళాశాలలో చదువుతున్నప్పుడు స్నేహితులు. శుక్రవారం ఇద్దరు నిందితులను బేస్తవారిపేట జంక్షన్‌లో అరెస్ట్ చేసి 55 గ్రాముల బంగారు ఆభరణాలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వృద్ధులను లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న దొంగలను చాకచక్యంగా పట్టుకున్న కంభం సీఐ మల్లికార్జున, ఎస్సైని ఎస్పీ రవీంద్రారెడ్డిని అభినందించారు.